

<u>*కథ 2007*</u>

*1*

# సముద్రం

పాపినేని శివశంకర్

'సముద్రాన్ని ఎక్కడ పారబొయ్యాలి?'

నా ముందున్న ప్రశ్న ఇది. ప్రశ్న నాది కాదు. సమాధానం కూడా నా దగ్గరలేదు. నేను కేవలం ఒకానొక పెనుహోరుని చాలాకాలం నుంచి సన్నిహితంగా గమనిస్తున్న మనిషిని మాత్రమే.

మర్చిపోతున్న గతమంతా గుర్తు చెయ్యమన్నావు. ఇది అల్జీమర్స్ వ్యాధి లక్షణం. ఇప్పుడు నా జ్ఞాపకాలే చెబుతున్నాను విను.

**(పుస్తకమాలి)**

1. వనమాలీ! ఏ చదువుకొనే రోజుల్లో కలిశాయో మన ఆలోచనలు! కొద్దికాలంలోనే స్నేహితులమయ్యాం. క్లాసులో లెక్చరర్లు ఊహించని ప్రశ్నలెన్నో అడిగేవాడివి. లైబ్రరీలో పుస్తకాలు తెచ్చి, సందేహాలు తీర్చుకొనేవాడివి. క్లాస్‌మేట్స్ నీకు పెట్టిన పేరు పుస్తకాల పురుగు. అయితే ఈ పురుగు పుస్తకాల్ని అదే పనిగా నమిలే పురుగు కాదు. సముద్రాన్ని సైతం పుక్కిటబట్టదల్చుకున్న పురుగు. నేను మాత్రం నిన్ను పుస్తకమాలి అని పిలిచేవాడిని. ఎప్పుడూ నాలుగైదు పుస్తకాలు నీతో పాటే ఉండేవి కదా! నీ ద్వారానే నాకు శ్రీశ్రీ, చలం, తిలక్ పరిచయం. నీవల్లే నేను సమాజాన్ని కొంత హేతుబద్ధంగా చూడటం నేర్చుకొన్నాను. చాలారోజులు నీ చేతుల్లో రంగనాయకమ్మ రామాయణ విషవృక్షం పుస్తకం ఉండేది. ఒక్కోసారి దస్తొవ్‌స్కీ క్రైం అండ్ పనిష్మెంట్.

2. షేక్స్‌పియర్ నాటకాలంటే నీకెంతో ఇష్టం. ముఖ్యంగా మాక్‌బెత్.

It is a tale told by an idiot, full of sound and fury, signifying nothing...

అని మాక్‌బెత్ జీవిత వ్యాఖ్యానం నువ్వు పొయెటిక్ యాక్సెంట్‌తో చదువుతుంటే తదేకంగా వినబుద్ధి అయ్యేది. మన ప్రిన్సిపల్‌కి మిల్టన్ ఇష్టం. షేక్స్‌పియర్ కన్న మిల్టన్ గొప్పవాడని ఆయన చెప్తుంటే క్లాసులో నువ్వు నిలబడి షేక్స్‌పియర్ పక్షాన వాదించటం- ఆయన సర్దుకొంటుంటే ఆడపిల్లలు నీవంక ఆరాధనగా చూడటం నాకింకా గుర్తే. విజ్ఞానానికి విలువున్న రోజులవి.

**(వృత్తిలో మనిషి)**

1. చదువు పూర్తికావటంతోనే విడిపోయాం. చదువుకొన్న యూనివర్శిటీలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరినట్లు ఉత్తరం రాశావు. ఉత్తరాల్లో నీ అక్షరాలు స్ఫుటంగా, నీ మనసు అర్థం చేసుకొని, కాగితం మీద కుదురుగా కూర్చున్నట్టనిపించేది, తొణుకు బెణుకు లేకుండా అచ్చంగా నీ మనస్సు మల్లేనే.

2. వృత్తికి, ప్రవృత్తికి అందరూ సంబంధం తెంచేసుకొంటున్న కాలంలో, షేర్లకి, రియల్ ఎస్టేట్ కార్యక్రమాలకి అంకితమైపోతున్న కాలంలో, నువ్వు వృత్తికి అంటుకుపొయ్యావు. పాఠంలో నువ్వు లీనమై, విద్యార్థుల్ని లీనం చేసే తీరు, పాఠానికే పరిమితంగాక, దానికి చుట్టుపక్కల అనేక సామాజిక విశేషాలు విపులీకరించే తీరు, ప్రశాంతతలో ఉద్వేగం కలిసిన ఉపన్యాస వైఖరి విద్యార్థుల్ని విశేషంగా ఆకట్టుకొనేది. వాళ్లకి నువ్వు ఆదర్శానివి. సమాచారం గాక వాళ్లల్లో సృజనాత్మకత పెంచటమే నీ ఆశయం. నీకుమల్లే బోధనారంగంలో గాకుండా అడ్మినిస్ట్రేటివ్ రంగంలో స్థిరపడినందుకు విచారం కలిగేది.

3. ఉద్యోగంతోనో, పెళ్లితోనో చాలామంది విస్తరణ ఆగిపోతుంది. అక్కడి నుంచి తమని తాము నెరువుకొనేవాళ్లు ఏ కొద్దిమందో. అటువంటివాడివి నువ్వు. నిన్ను నువ్వు పుస్తకాల పుటల్లో విస్తరించు కొన్నావు. నీ సామాజిక వ్యాసాలు పత్రికల్లో చదువుతూ వచ్చాను. మారుతున్న కాలాన్ని మారుతూ నువ్వు అవగాహన చేసుకొన్న తీరు వాటిల్లో కన్పించేది. ప్రజాసమస్యల పట్ల, ఉద్యమాలపట్ల మౌలిక స్పందన కన్పించేది.

4. చాలాకాలానికి మీ ఇంటికి వచ్చినప్పుడు గదుల నిండా పుస్తకాలు చూసి ఆశ్చర్యపోయాను. చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోవటంవల్ల కలిగిన ఒంటరితనం పుస్తక పఠనంలో మరుగుపడిందేమో.

అప్పుడు ఇరావతి కర్వే *యుగాంత* గురించి మాట్లాడుకొన్నాం. అస్తిత్వవాద ప్రాతిపదిక మీద భారతం గురించి ఆమె చేసిన విశ్లేషణ అద్భుతం అని వివరించావు. రాహుల్ సాంకృత్యాయన్ *ఓల్గా సే గంగా* గురించి మాట్లాడుకొన్నాం.

ప్రేమ్‌చంద్ *రంగభూమి* గురించి మాట్లాడుకొన్నాం. శరత్, కిషన్ చందర్, భైరప్ప, తక్కళి శివశంకర్ పిళ్లె, గోపీనాథ మహంతి, టి.ఎస్. ఇలియట్, క్రిస్టొఫర్ కాడ్వెల్, పాబ్లొ నెరుడా- ఎంతమంది రచయితలు నీ మాటల్లో మళ్లీ బతికారు! ఆ సాయంత్రం నేను నిజంగా జీవించిన రోజుల్లో ఒకటి.

5. "We are the hollow men, we are the stuffed men..."

- ఇలియట్ వేదన, నీ వేదన ఒకటేనా వనమాలీ? జీవన సారాంశం కోల్పోయి, డొల్లలుగా మారుతున్న మనుషుల గురించేనా?

మన సంభాషణ ప్రపంచమంతా తిరిగి విభూతి భూషణ వంద్యోపాధ్యాయ వనవాసి దగ్గర ఆగింది.

**(వనవాసి)**

1. గొప్ప నవల. ఒక యువకుడు- సత్యచరణ్- ఉద్యోగం కోసం తన స్నేహితుడి ఎస్టేట్‌లో మేనేజర్‌గా కుదురుతాడు. బెంగాల్‌లో ఎక్కడో దూర ప్రాంతాన ఎస్టేట్‌కి సంబంధించిన అడవుల్ని కొట్టేయించి, సాగులోకి తేవటం అతని పని. మొదట కలకత్తా జనసమ్మర్దానికి దూరమై, మారుమూల నిర్జన ప్రాంతానికి వెళ్లినందుకు విచారించినా మెల్లమెల్లగా ఆ ప్రకృతి అతడిని ఆకర్షిస్తుంది. అడవి అతణ్ణి ఆవహిస్తుంది. నాఢా, లవటు లియా, మోహన్‌పురా అడవుల సౌందర్యానికి ముగ్ధుడవుతాడు. ఆ అడవుల్లో భానుమతి లాంటి అందగత్తెలు, కుంతలాంటి నిర్భాగ్యులు, సంతాల్, గోండు, గంగోతావంటి తెగల నిష్ఠ దరిద్రులు అతనికి తారసపడతారు. వాళ్ల నిసర్గ జీవిత విధానానికి పరవశిస్తాడు. అయితే ఆ మహా సౌందర్యమంతా తన చేతుల మీదుగానే ధ్వంసమవుతుంది.

'ఓ అరణ్యానీ! ఆదిదేవతా, నన్ను క్షమించు,' అన్నది నవలలో ఆ యువకుడి చివరి వీడ్కోలు మాట.

'నాకెంతో నచ్చిన పుస్తకం, ఒక అద్భుతం,' అన్నావు. నచ్చినవన్నీ నీకు అద్భుతాలే.

2. "ఈయనలోని జ్ఞానదాహమే నాకు నచ్చిందన్నయ్యా! నిజమైన జ్ఞానదాహం గలవాడు మంచివాడనే నమ్మకంతోనే ఈయన్ని పెళ్లాడాను. అందుకు పశ్చాత్తాపం లేదు. కానీ పిల్లల పెంపకం కూడా నేనే చూసుకోవాలి. ఆయనకి పట్టదు. రోజుకి పదిగంటలు పుస్తకాల్లోనే. ఆరోగ్యం ఏమవుతుందో అని నా భయం," అంది కమలిని నీ పరోక్షంలో.

ఇంట్లో పుస్తకాల మధ్య, లేదా లైబ్రరీలో కాలమంతా గడపటం వల్ల ఆత్మీయులకి దూరమవుతుండటం కమలిని గమనించింది. నీకోసం ఆమె చాలా త్యాగం చేసిందనుకుంటా. నువ్వు రాసే వ్యాసాలు సాపు రాసి పంపించడం తన బాధ్యత. పిల్లల్ని స్కూలుకి తీసుకెళ్లి, తీసుకురావటమూ తన పనే.

3. రోజుల తరబడి బయటికి రావు. పరిగెత్తే మనుషుల్ని పట్టించుకోవు. కార్లలో తిరగాలనే కోరిక లేదు. కొండలు, వాగులు, సంధ్యాకాశాలు చూసి పరవశిస్తావు. ఆడంబరంగా ఉండవు. ఎప్పుడూ అవే రకం తెల్లదుస్తులు, నిర్మలంగా. నిలువెత్తు రూపం. వనమాలీ! ఆధునిక సన్యాసివి నువ్వు.

**(పుస్తకాలు-మనుషులు)**

1. 'నువ్వు పుస్తకాల్ని ఎక్కువ ప్రేమిస్తావా? లేక మనుషుల్నా?' అడిగానొక రోజు.

కొత్తగా కొన్న పుస్తకానికి నువ్వు అట్ట వేస్తుంటే చూస్తున్నాను. బహుశా పసిపిల్లకి తల్లి అట్లాగే దుస్తులు తొడుగుతుంది. అట్ట చిరిగిపోతే బాధపడతావు. పుస్తకం తీసుకొన్న స్నేహితుడు తిరిగి ఇవ్వకపోతే విచారిస్తావు. గొప్ప సంపదేదో కోల్పోయినట్టు.

'రెండిటినీ,' అని నీ జవాబు. 'రెండిటికీ వైరుధ్యమే లేదు. పుస్తకాల్ని ప్రేమించేవాడు మరింతగా మనుషుల్ని ప్రేమించగలడు. నిజానికి మనుషుల్ని ప్రేమించగలగటమే గొప్ప పుస్తకాలు నేర్పాయి.'

2. ఒకేపు అన్ని ఇళ్లల్లో బుక్‌షెల్ఫ్‌ల స్థానంలో షోకేసులు ఏర్పడుతుంటే మీ ఇంట్లో పుస్తకాల అరలు పెరిగిపోతున్నాయి.

వారానికొకసారి పుస్తకాల షాపులకు వెళతావు. ఆదివారం వస్తే పాత పుస్తకాల బజారుకు పోతావు. కొన్న

పుస్తకాలు, ఎవరెవరో పంపించే పుస్తకాలు- చరిత్ర, తత్వ శాస్త్రం, సామాజికశాస్త్రం, సాహిత్యం- ఎన్నెన్ని పుస్తకాలో - బొత్తులు బొత్తులుగా. సముద్రంలో అలల్లా పుస్తకాలే పుస్తకాలు.

చదివే పుస్తకాల నిండా అండర్‌లైన్లే. నోట్సు రాసుకోవటం, వ్యాసాలు రాయటం, రిఫరెన్సు కోసం పుస్తకాల దొంతర్లు విప్పటం, అవసరమైన విషయం మీద మరింత సమాచారం కోసం మళ్లీ పుస్తకాలు కొనటం, లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు తిరగెయ్యటం... నువ్వు మనుషుల్లో మెలుగుతున్నావో, పుస్తకాల్లో మెలుగుతున్నావో అర్థంకాని సంగతి.

3. 'రాత్రి కలొచ్చింది. గోరా కనబడ్డాడు, తెల్లగా,' అన్నావు.

'అదేమిటి?'

'రవీంద్రనాథ్ టాగోర్ నవల్లో నాయకుడు. అహ్మదాబాద్, గుజరాత్ మతకలహాలు చూస్తున్నాంగా. రేపు మాట్లాడాలి. చేతన కార్యక్రమంలో. గోరా నవల మళ్లీ చదివాను. మానవత్వమే తప్ప మతం జీవితానికి ప్రాతిపదిక కాదని టాగోర్ చెప్తున్నాడు. గోరా ఎంత శక్తిమంతమైన పాత్రో! కానీ నాకు ఆనందమయి అంటేనే ఇష్టం. నిజానికి ఆమె కరుణామయి. అమ్మతనానికి అంతకన్న గొప్ప ఉదాహరణ ఉంటుందా! గోర్కీ నీలోవ్‌నా వుందనుకో.'

4. శ్రీకాంత్, గోరా, హోరి, ధనియా, సూరదాసు, రామదాసు, పావెల్, రాస్కోల్నికోవ్, సోనియా, బజరోవ్, ఫిలిప్, శాంటియాగో, జాన్ క్రిష్టాఫ్- ఎక్కడెక్కడి పుస్తక మానవులంతా కళ్ల ముందు కనబడటం... మామూలు చాదస్తం కాదు. తిండి తిప్పలు మానేసి, గంటల తరబడి పుస్తకాల్లో మునిగి తేలటం లోకం దృష్టిలో అచ్చమైన పిచ్చితనమే.

**(నీలో సగం)**

1. వనమాలీ! నిన్ను రెండుగా విడగొడితే ఒక సగంలో పుస్తకం కన్పిస్తుంది. రెండో సగంలో కమలిని. పెళ్లిచూపుల్లో అన్నా కెరినీనా గురించి అరగంటసేపు మాట్లాడావని కమలిని చెప్పినప్పుడు అందరం నవ్వుకొన్నాం.

2. 'జీతంలో సగం పుస్తకాలకే అయిపోతుందన్నయ్యా!' ఫిర్యాదు చేస్తుంది కమలిని. నువ్వు నవ్వుతావు. తను మూతి ముడుస్తుంది. పొదుపరితనం తెలుసు తనకి.

3. పుస్తకాలు తరగతుల వారీగా సర్దేది కమలిని. పిల్లల్ని తాకనిచ్చేది కాదు. ఒక్కోసారి కావాలన్న పుస్తకం నీకు దొరక్కపోతే వెంటనే తీసిచ్చేది. పుస్తకాలు చదవటంలో ఆమెకంత ఆసక్తి లేదు. బహుశ ఆమె నిన్ను ప్రేమించటంచేత నీ పుస్తకపఠనాన్నీ ప్రేమించి వుండాలి. గొప్ప మేధావిగా సమాజంలో నీకు గుర్తింపు రావటం కూడా తనకి సంతోషం కలిగించి ఉంటుంది. పైకేమో, 'ఏదో నామీద జాలితో ఈ వంటింటిని మాత్రం పుస్తకాల్తో నింపకుండా వదిలేశారన్నయ్యా!' అంటుంది.

'ఏరోజూ రాత్రి పన్నెండు గంటలు కావాల్సిందే పడుకొనేపాటికి. రెండ్రోజులకో పుస్తకం తినేస్తారు. ఏదడుగుదామన్నా పరాకే. ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్‌గారు.'

4. నవంబర్ 19 రాత్రి తుఫాను వచ్చిపోయిన సంగతి కూడా నువ్వు గమనించలేదని కమలిని చెప్పినప్పుడు నాకెంతో ఆశ్చర్యం కలిగింది.

**(బుద్ధిజీవులు కార్యవాదులేనా?)**

1. దేశంలో The Great Degeneration మొదలైంది. గాంధీ, నెహ్రూల ఆదర్శాలకు కాలం చెల్లింది.

అన్ని రంగాల్లో విలువలు దిగజారుతున్నాయి. అవినీతి అందలమెక్కుతూ వెర్రి జనానికి నీతులు చెపుతోంది. అధికారగణం చేసిందే చట్టంగా చెల్లుబాటవుతోంది. అటువంటి సమయంలో దేశమంతా తిరిగావు.

'ప్రజల్లో స్వార్థం ఉంది. అజ్ఞానం ఉంది. సహనం ఉంది. సహజీవనం ఉంది. దేశమంతా దారిద్ర్యం ఉంది. దాన్ని పోగొట్టాల్సిన రాజకీయరంగంలో మానసిక దారిద్ర్యం ఉంది,' అనే అవగాహన వెల్లడించావు.

2. జ్ఞానం దేనికి? అనే నీ ప్రశ్నలోంచి రాష్ట్రంలో చేతన సంస్థ ఆవిర్భావం జరిగింది. అది నీ మూడో బిడ్డ. ప్రజల హక్కులు, కులమతాలు, స్త్రీల సమస్యలు- రకరకాల అంశాలపై ప్రజల్లో చైతన్యం కలిగించటం ఆ సంస్థ లక్ష్యం. నర్మదా బచావో ఆందోళనలో మేధా పాట్కర్‌ని కలిశావు. చిప్కో ఉద్యమనేతను కలిశావు.

3. పర్యావరణ పరిరక్షణ గురించి నీ కృషి నాకు తెలుసు. కొల్లేటి సరస్సు గురించి, వలసపక్షుల గురించి నువ్వు రాసిన వ్యాసాలు అపురూపమైనవి. అయితే కొల్లేరు పొంగి, ఊర్లన్నీ మునిగిపోయిందాకా ఎవరికీ చీమ కుట్టలేదు. చేతన పరిస్థితిని అధ్యయనం చేసింది. అందులో సభ్యుడుగా నువ్వు కొల్లేరు ప్రవాహానికి అటు ఇటుగా ఉన్న గ్రామాలు తిరిగావు. వేలకొద్దీ ఎకరాలు ఆక్రమణల పాలై- చేపల చెరువులై- కొల్లేరు సహజ ప్రవాహం భంగం కావటం- వానలు ముదిరినప్పుడల్లా గ్రామాలు మునిగిపోవటం- వివరాలన్నీ నివేదికలో చేర్చావు. పరిష్కార మార్గం సూచించావు. ఆ విధంగా విషయం కోర్టు కెక్కటం, సుప్రీంకోర్టు తీర్పు. ఆ తర్వాత ప్రభుత్వం చేపట్టిన పనికి చేతన ఊతమిచ్చింది.

ఇవాళ కొల్లేరు ప్రక్షాళన జరిగి, వలసపక్షుల కిలకిలలు మళ్లీ అక్కడ విన్పించినందుకు వనమాలీ, నిన్ను తప్పకుండా మెచ్చుకోవాలి.

**(తొలి చారిత్రక వ్యక్తి-ఒక జాతర)**

1. 'మనం మర్చిపోయిన తొలి చారిత్రక వ్యక్తి బుద్ధుడు. ప్రాణుల ఆనందంకోసం అష్టాంగమార్గం కనుక్కున్నాడు. ఆ మార్గం నుంచి తప్పుకున్నాం. సమ్యక్ దృష్టి లేదు. సమ్యగాలోచన లేదు.'

కాలచక్ర ఉత్సవాలు. కృష్ణానదీ తీరం వేలమంది బౌద్ధభిక్షువుల్తో కళకళలాడుతోంది. అమరావతిలో కలిశాం. నువ్వు, నేను, సతీష్. అతనికదే తొలిసారి అమ రావతి రావటం. మ్యూజియంలో స్థూపం శిథిలాలు, ముఖ్యంగా ఎద్దుబొమ్మ చూసి మురిసిపోయాడు సతీష్. కృష్ణానది ఒడ్డున మనం ముగ్గురం. దూరంగా టిబెటన్ భాషలో దలై లామా బోధన వినబడుతూంది.

'మర్చిపోవటం ఏమిటి? ఇటువంటి సందర్భాల్లో మళ్లీ తల్చుకోవటం లేదా? ఎంతమంది జనం వచ్చారో చూడండి,' అన్నాడు సతీష్.

'ఇదంతా జాతర. కాదంటే వేడుక. బుద్ధుణ్ణి నిజంగా మన మనస్సుల్లోకి ఇంకించుకొన్నామా? ఇంకించుకొంటే మన కళ్ల ముందు ఇంత హింస ఎందుకు జరుగుతుంది?' ఎదురు ప్రశ్న వేశావు.

'అసలైన సంస్కృతికి, మనకి బంధం తెగిపోయింది. సంస్కృతిలోని పద్ధతులు, తంతులు మాత్రమే మిగిలి, సారాంశం అంతరించిపోతున్న దశలో ఉన్నాం,' అన్నావు. సాంస్కృతిక నేపథ్యం లేని రాజకీయ నాయకుల వల్లనే క్రమక్రమంగా దేశ పతనం ప్రారంభ మైందని అన్నావు.

ఆ సాయంత్రం రాహుల్ సాంకృత్యాయన్ ఋగ్వేద ఆర్యులు దగ్గర్నుంచి, ధర్మానంద కోశాంబి *బుద్ధ భగవానుడు*, రొమిలా థాపర్ *ప్రాచీన భారతదేశం* దాకా భారతీయ సంస్కృతి గురించి ఎన్నెన్నో వ్యాఖ్యలు వివరించావు. మేమిద్దరం మౌనంగా విన్నాం. కృష్ణానది విన్నది. కనుచీకట్లో చుక్కల ఆకాశం విన్నది.

**(వారసత్వం)**

1. కమలిని టి.బి.తో పోవటం నీ జీవితంలో గొప్ప దుఃఖం. ఎంత ప్రయత్నంచేసీ బతికించుకోలేక పొయ్యావు. తోడు లేకుండా ఎట్లా బతకాలో తెలీని వాడివి. అందుకే కాబోలు, పోతూ పోతూ నిన్నెప్పుడూ వదిలి పెట్టొద్దని నాకు చెప్పింది. నువ్వు చిన్నపిల్లాడివని చెప్పింది.

2. 'లోపల పెద్ద అగాథం ఏర్పడినట్టనిపిస్తుంది. దేంతోనూ పూడ్చలేను. ఇప్పటిదాకా నా బతుకు ఎంతగా ఆమె మీద ఆధారపడి ఉందో తెలిసింది. నేనింకా ఎక్కువ కాలం బతకలేకపోవచ్చు. అయితే నా జీవితం కన్న కమలిని మరణం గురించే విచారంగా ఉంది,' నీ కళ్లల్లో నీళ్లు. ఓదార్చలేకపొయ్యాను.

చాలాసేపు విషాదమౌనం తరువాత, 'తెగిపోయింది,' అన్నావు. నా కర్థం గాలేదు. ఏదో లోకంలో ఉండి మాట్లాడటం నీకు మామూలే. 'పిల్లలకీ నాకూ మధ్య బంధమేదో తెగిపొయ్యింది. కమలిని ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు దాన్ని ముడేస్తుండేది. ఇప్పుడు ముడేసే తెలివి లేదు నాకు. నా అభిరుచులు, వాళ్ల పద్ధతులు వేరైపోయాయి. ఆలోచనల్లో దూరం పెరిగింది. ఎప్పుడన్నా వాళ్లు మాట్లాడినా ఏదో ముక్తసరిగా పొడిగా ఉంటున్నాయి మాటలు.'

కావలసిన మనుషుల మధ్య సమానస్థాయిలో భావప్రసారం లేనప్పుడు కలిగే వేదనను అర్థం చేసుకొన్నాను.

3. దేశమంతా పర్యటిస్తూ సాహిత్య సామాజిక అంశాల మీద ప్రసంగిస్తున్నావు. చేతన కార్యకలాపాలు పరిమితంగానే సాగుతున్నా నీ పేరు మాత్రం మారుమోగిపోయింది. ఇండియా టుడే దేశంలోని వివిధ రంగాల నుండి నూరుమంది మేధావుల్ని ఎన్నిక చేసింది. అందులో నువ్వు పదకొండో స్థానంలో ఉన్నావు. ఎంత సంతోషం! ఈ సమయంలో కమలినే గనక ఉంటే?

హైదరాబాద్ రవీంద్రభారతిలో నీకు సన్మానం చేస్తూ, నువ్వు నడిచే విజ్ఞానకోశానివని అందరూ ప్రశంసిస్తుంటే, ఈ విజ్ఞానకోశానికి వారసత్వం ఏమిటి? అనే సందేహం కలిగింది. నీ జ్ఞానం నీతో ముగిసిపోవటమేనా?

4. కూతురు రాసిన ఉత్తరం చదవమని నా చేతికిచ్చావు.

'డాడీ!

నువ్వు గొప్పవాడివి కావచ్చు. కానీ పిల్లల్ని గొప్ప వాళ్లని చెయ్యాలిగదా! సాటి వాళ్లంతా ఆర్థికంగా మెట్టు మెట్టుగా పైకెదిగిపోతుంటే నువ్వు అప్పటికీ ఇప్పటికీ అదే మెట్టు మీద కూలబడి దిక్కులు చూస్తున్నావు. అదే మెట్టుమీద ఉన్నవాళ్లకే నన్నిచ్చి చేశావు. ఏం సుఖ పడ్డాను? చాలీచాలని బతుకు. ఏ కోరికలూ తీరవు. ఎన్నటికీ పై మెట్టు ఎక్కలేని నిస్సహాయత. నిన్నిప్పుడు ద్వేషించలేను. అలాగని ప్రేమించనూ లేను-

మీ కూతురు

విమల

'మెట్టంటే ఏమిటి?' అనడిగావు, ఉత్తరం నేను చదవగానే. 'ఆర్థిక సోపానాలు తప్ప ఇంకే మెట్లు లేవా మనకి?'

ఎంతోమంది దృష్టిలో మెట్లంటే అవే. అవి ఎక్కడానికే నిరంతరం మన ప్రయత్నం. విజ్ఞానం, వివేకం, సామాజిక పాత్ర- ఇటువంటి మెట్లెక్కటానికి పూనుకొనే వాళ్లు ఇవాళ వెర్రివాళ్ల కిందే లెక్క. అయితే అందరి మాదిరిగా కళ్లు మూసి తెరిచేలోగా ఆ మెట్లేవో ఎక్కలేనందుకు నువ్వు విచారపడుతున్నట్టు లేదు.

'నేనున్న మెట్టు మీద, నన్ను నన్నుగా నా కన్న కూతురు ఆమోదించలేకపోయింది,' అన్నావు దిగులుగా.

5. కొడుకును గురించి ఇంకో విచారం.

'వాడు ఖండాలు దాటి వెళ్లిపోయాడు. కమలిని వాణ్ణి చాలా ముద్దుచేసేది. ఇవాళ యాహూ సామ్రాజ్యంలో వాడొక బంటు. బోలెడంత సంపాదన. కానీ వాడికి అమ్మతోనూ తనివితీరా మాట్లాడే తీరికలేదు. ఉన్నంత కాలం కమలినికి అదే దిగులు. మనుషులు అనంత దూరంలో ఉన్నా మనసుల్ని తాకుతూ మాట్లాడొచ్చు. దూరం కావటమే మనకు తెలుసు. దూరంగా ఉండీ దగ్గర కావటం తెలియదు.'

కావచ్చు. కానీ నీ వారసత్వం నీ సంతానం స్వీకరించలేకపోవటం పెద్ద విషాదం వనమాలీ!

**(అంతిమ అనివార్యత)**

1. జీవితంలో అంతిమ అనివార్యత మృత్యువు. దాన్ని నువ్వు ఆమోదించిన తీరు గొప్పది.

వరుసగా కొన్ని రోజులు మార్నింగ్ వాక్‌కి నువ్వు రాకపోయేటప్పటికి నాకనుమానం వేసి ఫోన్ చేశాను. పనిపిల్ల ఆందోళనగా చెప్పింది నీ అనారోగ్యం సంగతి. తెల్లారే నిన్ను కలిశాను.

ఒకవంక నీకిష్టమైన పాట వింటున్నావు.

*యహా పూరా ఖేల్ అభీ జీవన్‌కా*
*తూనే కహా హై ఖేలా*
*చల్ అకేలా చల్ అకేలా చల్ అకేలా...*

ముఖేష్ గొంతు విషాదాన్ని వొంపుతోంది.

మూత్రవిసర్జనలో బాధ గురించి, డాక్టర్లు చేసిన పరీక్షల గురించి చెప్పావు. ప్రొస్టేట్ గ్రంధి సమస్య. 'కమలిని లేని లోటు ఇప్పుడు బాగా తెలుస్తుంది,' అన్నావు. నిజమే ఆ చల్లని ప్రశాంతమూర్తి ఇప్పుడుంటే నీ అనారోగ్యం సగం తగ్గిపోయేదే.

2. కాలిఫోర్నియా నుంచి కొడుకు పరామర్శ, ఏలూరు నుంచి కూతురు. ఎవరూ వెంటనే వచ్చే వీలులేదు.

3. జబ్బు తీవ్రమైందని తెలుసు. అయినా నువ్వే మాత్రం భయపడకపోవటం ఆశ్చర్యం.

పి.ఎస్.ఎ. పరీక్షల్లో ప్రొస్టేట్ గ్రంధి పూర్తిగా వ్యాధిగ్రస్తమైందని తేలింది. సర్జరీ జరిగింది. అయినా జబ్బు ముదరటంవల్ల పెద్దగా ఉపయోగం ఉండదని డాక్టర్లు నీముందే చెప్పారు.

4. స్నేహితులు, అభిమానులు, పాత విద్యార్థులు వచ్చి పరామర్శిస్తున్నారు. చేతన కొనసాగిస్తామని మిత్రుల దగ్గర మాట తీసుకొన్నావు. పైకి నిమ్మళంగానే ఉన్నా, లోపల్లోపల దేని గురించో ఆందోళన పడుతున్నట్టు తోచింది. రెండుమూడు రోజుల్లో కూతురు వస్తున్నట్టు కబురు.

5. సాయంత్రం నీ దగ్గరకొచ్చాను.

'స్టీఫెన్ హాకింగ్స్ పేరు విన్నావా?' అనడిగావు.

'పెద్ద సైంటిస్టు కదా!'

'అతని స్ట్రింగ్ థియరీ సరిగా అర్థం కాలేదు. బ్లాక్ హోల్స్ అండ్ స్మాల్ యూనివర్సెస్ కూడా ఈమధ్యే చదివాను. అతను ఐన్‌స్టీన్ కన్నా గొప్పవాడంటావా?'

నువ్వున్న పరిస్థితేమిటో, నువ్వు ఆలోచిస్తున్న దేమిటో నీకర్థమైందా వనమాలీ! నిర్లిప్తుడా!

'*కన్ఫెషన్స్ ఆఫ్ యాన్ ఎకనామిక్ హిట్‌మాన్* పుస్తకం ఎక్కడన్నా దొరికితే తెచ్చి పెడుదూ?' అడిగావు.

సామ్రాజ్యవాద రథాశ్వం జాన్ పెర్కిన్స్. అమెరికా ప్రయోజనాల కోసం దేశదేశాల్లో ఎన్నో తప్పుడు పనులు చేసి, పశ్చాత్తాపం పొందిన బ్యూరోక్రాట్. అతని పుస్తకం.

6. పక్కనెవరూ లేరు. తీవ్రమైన అనారోగ్యం. నీ మొహంలో అదే నిర్లిప్తత. కాలిఫోర్నియా నుంచి నీ కొడుకు వస్తున్నట్టు ఫోన్. ఈ దేశంలో ఉన్నా కూతురింకా రాలేదు. కమలిని గుర్తొస్తుందన్నావు. తలగడ పక్కనే జాన్ పెర్కిన్స్ పుస్తకం, బోర్లా తెరిచిపెట్టి-

7. నీ నా స్నేహంలో కొన్ని గుర్తులివి.

నా జ్ఞాపకాలన్నీ విన్న తర్వాత కదిలీ కదలని పెదాల్లోంచి ఇప్పుడీ ప్రశ్న వేశావు.

''సముద్రాన్ని ఎక్కడ పారబొయ్యాలి?''

నాకర్థం కాలేదు. గదంతా కలియజూస్తున్నాను. అన్నివైపులా పుస్తకాల దొంతర్లు. రాక్స్, బీరువాలు- ఎటు చూసినా పుస్తకాలే- అలలు అలలుగా...

నీ లోపల్నుంచి ఏదో పెద్ద హోరు...

వనమాలీ! ఇప్పటికి నీ ప్రశ్న అర్థమైంది.

జవాబు మాత్రం నా దగ్గర లేదు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 4 ఫిబ్రవరి 2007*